క్లుప్తంగా

ఆ బాధ్యత తల్లిదండ్రులదే

అంబాజీపేట: విద్యార్థులను నిత్యం పాఠశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని ఎంఈఓలు జేవీ కనకదుర్గ, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పీఎంసీ సమావేశం ఇన్‌చార్జి హెచ్‌ఎం బొక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ అమ్మ ఒడి పథకం వర్తించాలంటే క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, హాజరు శాతం ఉండాలన్నారు. అమ్మఒడి మంజూరైన లబ్ధిదారులకు రూ.13 వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. అమ్మ ఒడికి సంబంధించి ఆయా గ్రామాల డిజిటల్ అసిస్టెంట్‌ల వద్ద లిస్టులు ఉన్నాయన్నారు. మనబడి నాడు – నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లిష్ మీడియంలో బోధన, వియ్ లవ్ రీడింగ్ తదితర అంశాలపై పీఎంసీ సభ్యులకు వివరించారు. పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి, ఉపాధ్యాయుడు వెన్నపు సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగ సంఘాల బలోపేతానికి చర్యలు

కొత్తపేట: రాష్ట్రంలో బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘాలను బలోపేతం చేసేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో కార్యక్రమం రూపొందిస్తున్నట్టు రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి సంసాని శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మట్టపర్తి సూర్యచంద్రరావు, పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో ఆర్.కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలు చర్చించినట్టు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో బీసీ సంఘాలకు నూతన కార్యవర్గాలు ఏర్పాటు చేయడం ద్వారా బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఈ సందర్భంగా ప్రస్తావకు వచ్చిందన్నారు.

30 నుంచి గురుపౌర్ణమి

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలోని జగ్గన్నపేటలో కొలువు తీరిన శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు గురు పౌర్ణమి వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ మంగళవారం తెలిపింది. 30వ తేదీ ఉదయం శ్రీషిరిడీ సాయినాథుని ఊరేగింపు జరుగుతుందన్నారు. 3వ తేదీ తెల్లవారు జాము నుంచి స్వామివారికి విబూది, పాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని చెప్పారు.

రూ.25 లక్షలతో రోడ్డు మరమ్మతులు



జోరుగా సాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

మామిడికుదురు: బి.దొడ్డవరం–పెదపట్నంలంక ఆర్ అండ్ బీ రోడ్డు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికపై నిర్వహిస్తున్నారు. రూ.25 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డు పూర్తిగా పాడైపోయిన చోట్ల రోడ్డును తవ్వేసి మెటల్‌తో పటిష్టం చేస్తున్నారు. సుమారు నాలుగు కిలో మీటర్లు పైబడి ఉన్న ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. నాలుగు రోజుల క్రితం చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే పరిశీలన...

పనుల్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంగళవారం పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఇప్పటికే ఆలస్యం జరిగిందన్నారు.

సెంచరీ దాటిన టమోత

- బహిరంగ మార్కెట్లో రూ.120
- వేసవి తీవ్రతతో దెబ్బతిన్న పంట



ఆలమూరు: తెలుగు రాష్ట్రాల్లోని ప్రజానీకం ఉల్లి తరువాత ఎక్కువగా ఉపయోగించే టమాటా ధర బేజారెత్తిస్తోంది. శాఖాహార, మాంసాహారులనే తారతమ్యం లేకుండా అందరూ ఇష్టపడే టమాట ధర అమాంతంగా పెరిగిపోవడంతో వినియోగం కూడా అదే స్థాయిలో తగ్గింది. టమాటా లేకుండానే నిర్వాహకులు ఫాస్ట్ ఫుడ్స్ తయారీ చేస్తున్నారు. మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ ధర రూ.90 ఉండగా బహిరంగ మార్కెట్లో రూ.120 పలుకుతోంది. నెల రోజుల వ్యవధిలోనే రూ.30 నుంచి రూ.120 పెరగడంతో వినియోగదారులు విస్తుపోతున్నారు. ఈ ఏడాది వేసవి సుదీర్ఘకాలం ఉండటంతో పంటలు ఎండిపోయి, సరఫరా తగ్గిపోయి రోజు రోజుకు టమాటా ధర పెరుగుతూ వస్తోంది. అలాగే మే తొలివారంలో కురిసిన భారీ వర్షాల వల్ల పూత, పిందె రాలిపోవడంతో తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తరువాత ఉష్ణోగ్రతలు పెరగడంతో తోటలు ఎండిపోయి ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో రాష్ట్రంలోని అత్యధికంగా టమాటా పండించే కర్నూలు, అనంతపురం, మదనపల్లి, చిత్తూరు మార్కెట్ల నుంచి సరఫరా ఒకేసారి నిలిచిపోయింది.

కర్నాటక నుంచి దిగుమతి

వేసవిలో సైతం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు చేసే కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లో పండించే టమాటాను రాజమహేంద్రవరం, మడికి, రావులపాలెం హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. సుమారు 24 కేజీలు బరువు ఉంటే టమాటా బాక్సు ధర నాణ్యతను బట్టి ప్రస్తుతం రూ.1,800 నుంచి రూ.2,100 వరకూ పలుకుతోంది. కర్నాటక వ్యాప్తంగా టమాటా పంట ఇప్పుడిప్పుడే అందుబాటులోకి రావడం వల్ల సరఫరా పరిమితంగా ఉండటంతో పాటు నాసిరకం, కుళ్లిన టమాటాను తీసివేసి హమాలీ, రవాణా చార్జీలు కలుపుకోగా కూరగాయ వ్యాపారికి కిలో రూ.90కి అందుతోంది. అధిక ధరల వల్ల గతంతో మడికి జాతీయ మార్కెట్‌లో సుమారు వంద టన్నుల వ్యాపారం జరిగే టమాటా నేడు కేవలం 20 టన్నులకే పరిమితమైంది. గత ఏడాది డిసెంబర్‌లో కోత కూలీ రాని టమాటా నేడు సెంచరీ దాటినా స్థానిక రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ధరల పెరిగిన సమయంలో ఉత్పత్తి లేకపోవడం కూరగాయల రైతులకు శాపంగా మారింది.

ఇప్పుడే ధరలు తగ్గే అవకాశం లేదు



ఇప్పుడే కర్నాటకలో టమాటా తోటలు అందుబాటులోకి రావడంతో ఉత్పత్తి అంతంగా మాత్రంగానే ఉండటం వల్ల ధర అధికంగా ఉంది. రాయలసీమ, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక ప్రాంతాల్లో పండించే టమాటా ఆగస్టులో అందుబాటులోకి వచ్చే వరకూ ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొంటుంది.

– చెల్లుబోయిన సింహాచలం, హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి, మడికి

కొనుగోలు తగ్గిపోయింది



టమాటా ధర ఒక్కసారిగా పెరిగిపోవడంతో కొనుగోలు చేసే వారి సంఖ్య అమాంతం తగ్గిపోయింది. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద బాక్సులతో కొనుగోలు చేస్తున్న టమాటా ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం లేక కుళ్లిపోయి తీవ్ర నష్టం మిగులుతున్నాయి.

– ఆచంట ఆదినారాయణ, కూరగాయల వ్యాపారి, ఆలమూరు

రుచికరమైన భోజనం అందించాలి

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడి జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాకానుక, అమ్మ ఒడి తదితర పథకాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదవాలన్నారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

పేదలకు ప్రభుత్వ సేవలు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు పేదలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. పుల్లేటికుర్రు 1, 2 సచివాయాల్లో జగనన్న సురక్ష పథకంపై సచివాలయ కన్వీనర్లకు, వలంటీర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ మండల కన్వీనర్ సత్యమోహన్ మాట్లాడుతూ చిన్న లోపాల వల్ల పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు అందని పేదలకు, పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యూటేషన్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ పథకం ద్వారా సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. పసుపల్లి, వక్కలంక, ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎంపీడీఓ కె.సత్యనారాయణ జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించారు.

ప్రతీ ఆడపడుచుకు స్వంత ఇల్లు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- అవిడిలో 766 మందికి ఇళ్ల స్థలాలు అప్పగింత



అవిడిలో మహిళకు ఇంటి స్థలం పట్టా అందిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఇల్లు లేని ప్రతీ ఆడపడుచుకు స్వంత ఇల్లు కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అవిడి పంచాయతీ పరిధిలోని మూడు లేఅవుట్‌లలో 766 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అప్పగింత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అధ్యక్షత వహించగా కలెక్టర్ హిమాన్షుశుక్లా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళల పేరునే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రక ఘట్టానికి నాంది పలికారని అన్నారు. నియోజకవర్గంలో రూ.172 కోట్ల వ్యయంతో 343.98 ఎకరాలు సేకరించి 17,190 మందికి పట్టాలుగా ఇవ్వడం సరికొత్త రికార్డు అని అన్నారు. అనంతరం అవిడి డామ్ సెంటర్ సమీపంలో 246 మందికి, ఉచ్చిలివారిపేటలో 520 మందికి ఎవరికి కేటాయించిన స్థలంలో వారిని (మహిళలను) కుర్చీ వేసి కూర్చోపెట్టి నివేసన స్థలం పట్టాతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, రవికల గుడ్డను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా పంపిణీ చేశారు. అవిడి గ్రామంలో రూ 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, కుడుపూడి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, వానపల్లి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం

- ఎమ్మెల్యే చిట్టిబాబు



పెదపట్నంలంకలో అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సంక్షేమ పథకాల అమలు వైఎస్సార్ సీపీ సర్కారుకే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పెదపట్నంలంకలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. దళారీల వ్యవస్థ లేకుండా అవినీతికి చోటు లేకుండా పారదర్శకమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు పిచ్చుక చిన్న, రాయుడు ఆనంద్, గెద్దం కృష్ణమూర్తి, కొమ్ముల సూరిబాబు, తులా గోపాలకృష్ణ, గిడుగు శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



అప్పనరామునిలంకలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: పేదరికం ఒకటే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం అప్పనరామునిలంకలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తూ, ఆర్థికంగా వారికి భరోసా కల్పిస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము, నాయకులు చొప్పల రాజబాబు, కె.అశోక్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొత్తపేటలో లబ్ధిదారులకు పథకాల పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్ర చరిత్రలో ఇంటింటికీ వివిధ పథకాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక మూడవ సచివాలయం పరిధిలోని ఓల్డ్ బ్యాంక్ కాలనీ ప్రాంతంలో మంగళవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారిని ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందాయి అంటూ దాదాపు అందరూ ఆనందంగా వివరించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. మనందరి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది.. వాటిని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, చావలి సుబ్బరాయశాస్త్రి, విళ్ల వీర్రాజు, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, బండారు కృష్ణమూర్తి, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, గృహ సారథులు యాళ్ల బంగార్రాజు, ఎ.జగదీష్, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ ఎస్ రెడ్డినాయుడు, పంచాయతీ కార్యదర్శి వీవీ రామన్ పాల్గొన్నారు.

శాకంబరిగా నూకాంబిక



చింతలూరులో శాకంబరి అవతారంలో నూకాంబిక అమ్మవారు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసి యున్న నూకాంబికా అమ్మవారు మంగళవారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో దేవదాయశాఖ పర్యవేక్షణలో గ్రామానికి చెందిన మహిళా భక్తబృందం అమ్మవారిని శాకంబరిగా అలంకరించింది. 108 కేజీల బరువైన 21 రకాల కూరగాయలతో 12 అడుగుల ఎత్తైన అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. ఆలయం వద్ద మహిళా భక్త భజన బృంద సభ్యులు శ్రీలలిత, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. జేపీ డి.భాస్కర్ శ్రీనివాసు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ మధుసూదన్

పి.గన్నవరం: గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద మండలంలో జరిగిన పనులపై సామాజిక బృందాలు ఇటీవల నిర్వహించిన తనిఖీపై మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల్లో మొత్తం 866 పనులు జరిగాయి. వీటి నిమిత్తం ఉపాధి కూలీలకు రూ.7,43,87,979 ఖర్చు చేశారు. మెటీరియల్‌కు రూ.2,49,99,916 వెచ్చించారు. దీనిపై ఇటీవల గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పనుల్లో తేడాలను గుర్తించి రూ.37 వేలు రికవరీ చేశారు. వివిధ అంశాలపై క్షేత్ర స్థాయి సిబ్బంది చేసిన తప్పులకు రూ.11 వేలు జరిమానా విధించారు. ఎస్ఆర్ఈజీఎస్ ఏపీఓ బొంతు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ మాట్లాడారు. ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని పీడీ చెప్పారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీపీలు జి.కవిత, సత్యనారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, పి.గన్నవరం ఏపీఓ బొంతు చంద్రమోహన్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఆదిమూలం సూరయ్యకాపు, ఎంపీటీసీ సభ్యుడు కొల్లే సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు మృతి



విత్తనాల సుబ్బారావు (ఫైల్)

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారానికి చెందిన మాజీ ఇన్‌చార్జి ఎంపీడీఓ విత్తనాల సుబ్బారావు (67) సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు రోజుల క్రితం బెయిన్ స్ట్రోక్ రావడంతో అమలాపురం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా కుమారుడు ఇంద్రశేఖర్ వైఎస్సార్ సీపీ నాయకుడిగాను, ఆయన కోడలు దుర్గాభవాని ఎంపీటీసీగా పనిచేస్తున్నారు. సుబ్బారావు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి చంద్రశేఖర్, ఎం.ఎం.శెట్టి, వాసంశెట్టి చినబాబు, రాయుడు షన్ముఖ్ సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా..

అందరి సంక్షేమానికి జగనన్న సురక్ష

ఆలమూరు: జగనన్న సురక్ష పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.జాన్ లింకన్, తహసీల్దార్ ఐపి శెట్టి పేర్కొన్నారు. జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'జగనన్న సురక్ష' మండల ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాసు,నామాల శ్రీనివాసు ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను నెలరోజులపాటు ఉచితంగా అందిస్తున్నామన్నారు.

పోలియో బాధితురాలికి చేయూత

రావులపాలెం: పోలియోతో రెండు కాళ్లు పోగొట్టుకుని ఇబ్బంది పడుతున్న ఈతకోట గ్రామానికి చెందిన నేదునూరి మంగకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సాయం చేశారు. ఆమె నివాసం ఉంటున్న గుడిసె కూలిపోయే స్థితిలో ఉండటంతో రూ.20 వేలు ఖర్చు చేసి షెడ్ నిర్మించి మంగళవారం ఆమెకు అప్పగించారు.

ఎండీఎం వర్కర్లకు సూచనలు

ఆలమూరు : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రామచంద్రపురం డీవైఈవో పి.షాలెంరాజు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామలక్ష్మణమూర్తి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు సక్రమమైన రీతిలో వండి సరఫరా చేయాలని ఎండీఎం వర్కర్లకు సూచనలు చేశారు.

వంతెన పనుల పరిశీలన

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదిపాయపై ప్రభుత్వం మంజూరు చేసిన వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వశిష్ట నదిపై వంతెనకు రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ పనుల్లో భాగంగా ముందుగా చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై వంతెనను నిర్మిస్తున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

రావులపాలెం: మండలంలోని గోపాలపురం పీహెచ్‌సీని మంగళవారం జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భారతలక్ష్మి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ లెప్రసీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వివిధ కార్యక్రమాల ద్వారా వారికి అవగాహన కల్పించాలన్నారు. జాతీయ హెల్త్ ప్రోగ్రామ్స్ గురించి డాక్టర్లు సాయిలేఖ, స్వాతిలతో చర్చించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని రామచంద్రపురం ఉప విద్యాధికారి పి.షాలెంరాజు సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బరాజు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ చిర్ల కనికిరెడ్డి పాల్గొన్నారు.

పంటబోదె బాగుచేత

అయినవిల్లి: నేదునూరు రైతులు స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చిన నేపథ్యంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ రైతులతో కలిసి పంట బోదెను పరిశీలించి పంటచేలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. పొక్లెయినర్‌తో పంట బోదెలో ఉన్న పూడికను తొలగించేంచారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కళ్లేపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రూ.23 లక్షలతో కైలాసభూమి

ఆత్రేయపురం: మండల పరిధిలోని వద్దిపర్రులో ఎన్ఆర్ఐ రూ.23 లక్షలతో కైలాస భూమి నిర్మించారు. జుజ్జవరపు వెంకట సుబ్రహ్మణ్యం, శివ రామకృష్ణ, నాగేశ్వరరావు జ్ఞాపకార్థం జుజ్జవరపు మణికుమార్ (అమెరికా) దీన్ని మంగళవారం గ్రామస్తులకు అప్పగించారు.

రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం సచివాలయాల పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన మొత్తం రూ.40 లక్షలతో నిర్మించనున్న రెండు రోడ్లకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు పోతాబత్తుల భాస్కరరావు, మాజీ సర్పంచ్ కొల్లాటి నరసింహస్వామి పాల్గొన్నారు.

మోదీ దేశాన్ని అగ్ర పథంలో నిలిపారు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో దేశాన్ని అగ్రపథంలో నడిపించారని బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ కటికిరెడ్డి తమ్మయ్య నాయుడు పేర్కొన్నారు. గృహ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఆ పార్టీ నేతలు మంగళవారం ఆదుర్రులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు.

కరపత్రాల పంపిణీ

అయినవిల్లి: కేంద్రంలో బీజేపీ పాలన తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అయినవిల్లి, తొత్తరమూడి, మాగం, కె. జగన్నాథపురం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆ పార్టీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి మానేపల్లి అయ్యాజీ వేమా, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం

సఖినేటిపల్లి: అంతర్వేదిలో ప్రతి ఇంటికీ వెళ్ళి బీజేపీ శ్రేణులు ప్రచారం చేశాయి. పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, కాపిశెట్టి కనకేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం పథకాలు

మలికిపురం: విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లక్కవరం ఎంపీపీ యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఎన్ఇ ప్రభాకర్ పేర్కొన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశం అధ్యక్షుడు కామవరపు జయరామ కృష్ణ అధ్యక్షతన మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగింది. అధ్యక్షుడు జయరామ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నాడు నేడుతో పాఠశాలల ఆధునికీకరణతో పాటు విద్యార్థులకు అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు అందిస్తున్నదన్నారు. విద్యాకానుక ద్వారా మెటీరియన్ పూర్తి స్థాయిలో అందిస్తుందన్నారు.

వేగంగా సర్వే

ఆత్రేయపురం: లెప్రసీ నివారణ సర్వే వేగంగా చేయాలని లెప్రసీ అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ భారతలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ర్యాలి పీహెచ్‌సీలో చేపడుతున్న లెప్రసీ నివారణ సర్వేను ఆమె పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వ్యాధి సోకినవారి వివరాలు సేకరించాలన్నారు. వైద్యాధికారులు సునీత, దుర్గా భవానీ పాల్గొన్నారు.